క్లుప్తంగా

భారతీయ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం


పత్తికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పత్తికొండ(తుగ్గలి) : మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని టీటీడీ, హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. నాలుగు రోజులుగా పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ప్రముఖ రంగస్థల కళాకారుడు పాయసం పెద్ద రంగారెడ్డి ప్రవచనాలు భక్తులను అలరించాయి. అనంతరం గో మాతకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అమరావతి శ్రీనివాస్, టీటీడీ, వీహెచ్‌పీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ఆస్పరి: ఆస్పరిలో మారెమ్మవ్వ, రామ తీర్థంలో వెలసిన గాయత్రీమాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మ వార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

దోమల కట్టడికి చర్యలు


ఎల్లార్తి రోడ్డులోని మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్న పంచాయతీ, వైద్యారోగ్య సిబ్బంది

ఆలూరు రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు దోమల కట్టడికి చర్యలు చేపట్టారు. శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ, సచివాలయం –2 వైద్యారోగ్య సిబ్బంది దోమల నివారణ చర్యలను ప్రజలకు వివరించారు. కోయనగర్ కాలనీ, ఎల్లార్తి రోడ్డులోని మురుగు కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేశారు. వీటి వల్ల దోమలు లార్వా దశలోనే నశిస్తాయన్నారు. దోమలు పెరగకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాత టైర్లు,కొబ్బరి చిప్పలు, డమ్ముల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని ఆయా కాలనీ వాసులకు అవగాహన కల్పించారు.

కుక్కల దాడిలో పొట్టేళ్లు మృతి


మృతి చెందిన పొట్టేళ్లు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో శుక్రవారం కుక్కలు దాడి చేయడంతో వీరన్నకు రెండు పొట్టేళ్లు మృతి చెందాయి. వీరన్న ఇతర ప్రాంతాల నుంచి పొట్టేళ్లు, గొర్రెలు తెచ్చుకొని మేపి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఇంటి దగ్గరున్న షెడ్డులో గొర్రెలు, పొట్టేళ్లను కట్టేసి ఉంచాడు. అయితే వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో బెదిరిపోయి రెండు పొట్టేళ్లు మృతి చెందాయని వాపోయాడు.

జొన్న కోతలు వాయిదా వేసుకోండి


తుపాన్ ధాటికి దెబ్బతిన్న పత్తి పంట

హాలహర్వి: తుపాన్ ప్రభావం కారణంగా రైతులు జొన్న పంట కోత వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శివశంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల పత్తి, మిరప, జొన్న పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. తుపాన్ ప్రభావం తగ్గిన తర్వాత కోతలు ప్రారంభించుకోవాలని సూచించారు.

పండ్ల తోటల సాగులో రైతులు రాణించాలి

దేవనకొండ: పండ్లతోటల సాగులో రైతులు రాణించాలని సే ట్రీస్ టెక్నికల్ అధికారి హోమేంద్ర అన్నారు. కప్పట్రాళ్ల గ్రామంలో శుక్రవారం తానాశ్రీ శక్తి భవనంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండ్లతోటల నిర్వహణ, తెగుళ్ల నివారణ, మొక్కల పెరుగుదలకు అవసరమైన చర్యలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఎండాకాలంలో నీటి ఎద్దడిని అధిగమించడానికి అవసరమైన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రైతులకు మామిడి, చీని, జామ, అంజూర, టేక్, చింతాయ, ఎర్రచందనం, మహాగని, సీతాఫలం తదితర పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే మొక్కల సంరక్షణకు అవసరమైన కత్తిరింపు కత్తెరలను అందించారు. దేవనకొండ సీఐ వంశీనాథ్ పాల్గొని మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా రాణించాలని పిలుపునిచ్చారు.


మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న శ్రీదేవి, పార్టీ నాయకులు,


పత్తికొండలో మాట్లాడుతున్న కంగాటి శ్రీదేవి

దగాపై దండయాత్ర

- ఆరునెలల్లోనే కరెంట్ చార్జీల బాదుడు
- ప్రభుత్వ నిరంకుశ తీరుపై పత్తికొండలో వైఎస్సార్‌సీపీ 'పోరుబాట'
- అంబేడ్కర్ సర్కిల్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు భారీ ర్యాలీ
- విద్యుత్ చార్జీల పెంపు, హామీల విస్మరించడంపై మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మండిపాటు


డీఈఈకి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : ప్రజలకు బాసటగా వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. కూటమి సర్కార్ ప్రజల నడ్డివిరిచేలా వ్యవహిస్తున్న తీరుపై జనంతో కలిసి ఉద్యమించింది. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందంటూ వైఎస్సార్‌సీపీ నిరసన గళమెత్తింది. ×అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచం. అవసరమైతే తగ్గిస్తాం× అంటూ ఎన్నికల ముందు ఊరూరా ప్రచారం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు.. కరెంటు చార్జీలు తగ్గించక పోగా ఆరు నెలల్లోనే రెండుమార్లు పెంచి ప్రజలపై ఏకంగా రూ.15,485 కోట్లు భారం మోపారని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిరంకుశ తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం పత్తికొండలో పోరుబాట పేరుతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికికు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి నాలుగు స్తంభాల కూడలిలో పార్టీ మండల అధ్యక్షుడు కారం నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా మద్దికెర జెడ్పీటీసీ సభ్యులు మురళీధర రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, తుగ్గలి, మద్దికెర మండలాల పార్టీల అధ్యక్షులు జిట్టా నాగేష్, వెంకటేశ్వర్లు, పత్తికొండ, జీ.ఎర్రగుడి మాజీ సర్పంచ్‌లు సోమశేఖర్, రామచంద్రారెడ్డి మాట్లాడారు. చివరగా..మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు షాకుల మీద షాకులిస్తోందన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి చంద్రబాబు ఎంత మోసం చేశారో ఇప్పుడు ప్రజలకు అర్థమవుతోందన్నారు. ఆరునెలల తిరగకుండానే రెండుసార్లు జనంపై చార్జీల మోత మోగించడం దారుణమన్నారు. ప్రభుత్వ తీరుతో సామాన్య ప్రజలే కాకుండా కుటీర, మధ్య తరహా పరిశ్రమలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఆరు హామీలు అడ్రస్ లేకుండా పోయాయని విమర్శించారు. సంపద సృష్టిస్తామని చెప్పి ఇప్పుడు చార్జీల భారం మోపుతున్నారని, ఇదేనా సంపద సృష్టి అంటే అని ప్రశ్నించారు. తన పాలనా వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి చంద్రబాబు కొత్త అలజడులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి విద్యుత్ కార్యాలయంలో డీఈఈ ఖాజావలికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తుగ్గలి జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, కృష్ణగిరి, పత్తికొండ, తుగ్గలి ఎంపీపీలు వెంకటరామిరెడ్డి, నారాయణదాసు, ఎర్ర నాగప్ప, కృష్ణగిరి మండల అధ్యక్షుడు వెంకటరాముడు, నాయకులు శ్రీనివాసరెడ్డి, భాస్కరరెడ్డి, జగన్నాథ రెడ్డి, మోహన్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హనుమంతు, సుధాకరరెడ్డి, మల్లికార్జునయాదవ్, జి కృష్ణ, మల్లికార్జునరెడ్డి, గాంధిరెడ్డి, భద్రయ్య, బలరాముడు, శ్రీనివాసులు, పక్కీరప్ప, కృష్ణ, బనగాని శీను, నెట్టేకల్లు, నజీర్, చాంద్‌బాషా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


తగ్గేదేల్యా .. నిరసన ర్యాలీలో బైక్‌పై ఉత్సాహంగా వృద్ధుడు

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి


విద్యుత్ ఏడీఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి, నాయకులు


ఆలూరు ఏడీఈ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆలూరు: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడకుండా చూస్తామని హామీనిచ్చిన చంద్రబాబు నాయుడు ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి జనంపై మోయలేని భారం మోపి మోసం చేశారని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు పోరాబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ ఆలూరు మండల కన్వీనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ, జిల్లా కోశాధికారి కొత్తకాపు మధుసూధన్ రెడ్డి, జిల్లా నాయకులు శేషప్ప పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంవిద్యుత్ ఏడీఈ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏడీఈ సంతోష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి హొళగుంద మండలాల కన్వీనర్లు, మారయ్య, పెద్దయ్య,రామిరెడ్డి, షఫిఉల్లా , దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, నాయకులు హంపిరెడ్డి, శ్రీనివాసులు, ఉమాంబ, బసవరాజ్,గోవర్ధన్, రామాంజనేయులు,మల్లికార్జున, నాగేంద్ర, నాగరాజ్, ఎస్‌కే. గిరి, ఇమ్రాన్,, శ్రీనివాసులు, దుబ్బలింగ, వీరేష్, బాషా, వరుణ్, భాస్కర్, బాబు, శేఖర్, వీరభద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి,సోమశేఖర్, తిమ్మప్ప పాల్గొన్నారు.



ఆలూరులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పాల్గొన్న ఎమ్మెల్యే విరూపాక్షి

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


పోతుగల్లులో మురుగును పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

కృష్ణగిరి: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. మండలంలోని పోతుగల్లు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన డ్రై డేలో పాల్గొని ప్రజలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, లేని పక్షంలో డ్రమ్ముల్లో నిల్వ ఉంచే నీరు, ఇంటి ఆవరణంలో ఉండే పనికిరాని వస్తువుల్లో వర్షపు నీరు చేరి దోమలు ఉత్పత్తి చెందుతాయన్నారు. వీటి ద్వారా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు.

మద్దికెర : దోమల వల్ల వ్యాపించే డెంగీ, మలేరియా వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. మద్దికెరలో చాకలి వన్నూరమ్మకు డెంగీ సోకిందని చాకలి వీధిలో పర్యటించి కాలువల్లో మందుల స్ప్రే చేయించారు. సీహెచ్‌ఓ నిరంజన్, మలేరియా సబ్ యూనిట్‌అధికారి వెంకటేశులు పాల్గొన్నారు.

ఖాతాదారులు ఈ–కేవైసీ చేయించుకోవాలి

కృష్ణగిరి: మండలంలోని కృష్ణగిరి, కోయిలకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో ఉన్న ఖాతాదారులు ఆయా సచివాలయాల్లో ఈ–కేవైసీ చేయించుకోవాలని పర్సన్ ఇన్‌చార్జ్‌లు లక్ష్మికాంతరెడ్డి, నాగరమణయ్య తెలిపారు. శుక్రవారం ఆయా సంఘాల సీఈఓలు శివన్న, రమేష్ ఆధ్వర్యంలో ఖాతాదారుల సమావేశాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంఘాల్లో ఉన్న ఖాతాదారులు ఈ–కై వేసీ చేయించుకుంటేనే ప్రభుత్వ రాయితీలు లభించడంతో పాటు ఓటు హక్కు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి సున్నా వడ్డీ రుణాలు, ఎరువులు కొనుగోలు, పంట ఉత్పత్తులను అమ్ముకోవాలన్నా ఈ–కేవైసీ తప్పనిసరన్నారు. గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్‌కు మీ వివరాలు అందజేసి ఓటీపీ ద్వారా ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని సహకార సంఘంలో సభ్యత్వం, రుణాలు తీసుకున్న రైతులు తమ గ్రామాల పరిధిలోని సచివాలయాల్లో ఈ–కేవైసీ చేయించుకోవాలని సహకార సంఘం సీఈఓ రామకృష్ణుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సదస్సులతో భూ వివాదాలు పరిష్కారం


పోతుగల్లులో భూ సమస్యలపై అర్జీలు ఇస్తున్న రైతులు

తుగ్గలి : భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి అన్నారు. శుక్రవారం రాతనలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 9 అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. డీటీ నాగరాజు, మండల సర్వేయర్ సుధాకర్ పాల్గొన్నారు.

పత్తికొండ మండలంలో..

పత్తికొండ మండలం పెద్దహుల్తితో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రమేష్ హాజరై రైతులను అర్జీలు స్వీకరించారు. ఆర్‌ఐ శ్రీనివాసులు, మండల సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వో రంగస్వామి పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మూసానహళ్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 6 అర్జీలు స్వీకరించామన్నారు.

మద్దికెర : రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ అన్నారు. శుక్రవారం బురుజుల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్‌ఐ రవికుమార్, వీఆర్వో రషీద్ పాల్గొన్నారు.

కృష్ణగిరి: రెవెన్యూ సదస్సుల రైతుల భూ సమస్యలను పరిష్కస్తామని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మిరాజు పేర్కొన్నారు. మండలంలోని పోతుగల్లు గ్రామంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి నూకరాజుతో కలిసి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల నుంచి 125 అర్జీలు వచ్చినట్లు వారు తెలిపారు. సర్పంచ్ తెలుగు వాణీశ్రీ, వీఆర్వో రాజశేఖర్‌రెడ్డి, సాగునీటి సంఘం చైర్మన్ సోమలింగం గౌడ్ పాల్గొన్నారు.

వెల్దుర్తి మండలంలో

వెల్దుర్తి(కృష్ణగిరి): చెరుకులపాడు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వేయర్ హేమంత్‌రెడ్డి, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

హొళగుంద: మండలంలోని నాగరకణ్వీ డిప్యూటీ తహసీల్దారు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. మొత్తం 9 అర్జీలు అందజేశారు. ఎండోమెంట్ అధికారి నరేంద్ర, వీఆర్‌ఓ ప్రహ్లాద పాల్గొన్నారు.

రాధామనోహర్ దాస్‌కు ఘన సన్మానం


రాధామనోహర్‌దాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పత్తికొండ(తుగ్గలి) : ఇస్కాన్ ధర్మ ప్రచారకులు రాధామనోహర్‌దాస్‌ను పూజ్యశ్రీ అనంత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైందవ పాంచజన్యం బిరుదుతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన్ను సత్కరించారు. ధర్మ వ్యాప్తి కోసం దాస్ జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేశారని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అనంత అనిల్‌కుమార్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, విశేష సంపర్క ప్రముఖ్, జిల్లా ఉపాధ్యక్షుడు నాయకంటి బీమిరెడ్డి, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ఆవోపా చీఫ్ మలిపెడి నాగేశ్వరరావు, నిమ్మయ్యదాస్, రామలింగయ్య, వీరరాజు, రాజేష్‌నాయుడు, అర్చక పరిషత్ రాష్ట్ర నాయకులు నాగరాజు స్వామి, గోవర్ధననాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి ఖాజాస్వామి ఉరుసు

చిప్పగిరి: మండలంలోని ఏరూరు గ్రామంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు ఖాజా స్వామి 54వ ఉరుసు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తిమ్మాపురం వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఉరుసుకు స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు పాల్గొంటారని చెప్పారు.

ఘనంగా గంధోత్సవం

తుగ్గలి : మండలంలోని కోతికొండలో వెలసిన దస్తగిరిస్వామి ఉరుసు ప్రారంభమైంది. వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గాలో సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి స్వామి ఊరేగింపు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హొళగుంద: మండలంలోని చిన్నహ్యాట కొండలో పేకాట ఆడుతున్న ఏడుగురుని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ బాల నరసింహులు శుక్రవారం తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు కొండలో పేకాట ఆడుతుండగా దాడి చేసి ఏడుగురిని అదుపులో తీసుకుని రూ.19,590 నగదు, 6 బైకులు, పేక ముక్కలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఫీ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

మద్దికెర : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. నిధులు విడుదల చేయాలంటూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. పలు కళాశాలల్లో ఫీరీయింబర్స్‌మెంట్ రాలేదని విద్యార్థులను పరీక్షలకు అనుమతించడం లేదన్నారు. అనంతరం వినతి పత్రాన్ని కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రావమదాసుకు అందజేశారు. మండల ఉపాధ్యక్షులు తిమ్మన్న, రాము, వేణు, వివేక్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

మద్దికెర : విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని సర్పంచ్ విజయుడు, హెచ్‌ఎం ఫరూక్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో పదవ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ తయారు చేసిన ఆల్‌ఇన్‌వన్ మెటీరియల్‌ను దాతల సహకారంతో ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు శేషాద్రి, పరుశురాముడు, శివ పాల్గొన్నారు.

వైభవం.. లక్ష్మీనారాయణస్వామి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న పండితులు

మద్దికెర : గ్రామ శాంతి, ధర్మకార్యం కోసం భక్తుల చెంతకే భగవంతుడు అనే కార్యక్రమంలో భాగంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామి వారు దేవేరులతో కలిసి కసాపురం క్షేత్రం నుంచి ధర్మరథంపై శుక్రవారం స్థానిక శ్రీమద్దమాంబ దేవాలయానికి విచ్చేశారు. దేవాలయ ఆవరణలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా శ్రీలక్ష్మీ, నారాయణస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పండితులు వేదయుక్తంగా మాంగల్యధారణ కార్యక్రమం జరిపించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడు, మాధవ్, ప్రతాప్, తిక్కన్న, చంద్రశేఖర్, వెంకట్రాముడు, రాజశేఖర్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి


మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు: ఆర్థిక సంస్కరణల సారథి, గొప్ప రాజనీజ్ఞుడు, మేధావి అయిన మన్మోహన్‌సింగ్‌ను మృతి దేశానికి తీరని లోటని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చిప్పగిరి: దేశం ఒక గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని ఆలూరు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వినోద్,గోవిందు,రాంబాబు పాల్గొన్నారు.

దేవనకొండ: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సంతాప సభను ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి రఫిక్, రిటైర్డ్ హెచ్‌ఎం ఉచ్చీరప్ప, ఎఫ్‌ఆర్‌హెచ్‌ఎస్ కరస్పాండెంట్ పి.రఘునాథ్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వీరయ్య, శ్రీనివాసులుయాదవ్, మల్లికార్జునరెడ్డి, భీమేష్, ఇనయతుల్లా, నాగరాజ్ పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన వెల్దుర్తిలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రజాస్వామ్యం, లౌకికతత్వం కాపాడేందుకు పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని అల్లుగుండు గ్రామంలో పార్టీ శత వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామ కార్యదర్శి చిలిపి కృష్ణతో కలిసి జెండా ఆవిష్కరించారు. మండల సహాయ కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి చిన్న మాదులు, ఎల్ల శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ఆస్పరి: ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే పాఠశాలల యాజమాన్యలపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ–2 తిరుమలరావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక నారాయణ ప్రైమ్‌స్కూల్, నోబుల్ ప్రవేట్ స్కూళ్లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు సంబంధించి ఆపార్, యూ డీఐఎస్‌ఈలో జీపీ, ఈపీ, యఫ్‌పీలను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా పాఠశాలల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

బీజేపీ మండల అధ్యక్షురాలి ఎన్నిక

హొళగుంద: భారతీయ జనతా పార్టీ మండల కమిటీ నూతన అధ్యక్షురాలుగా సుధ ఎన్నికైంది. శుక్రవారం పార్టీ సీనియర్ నాయకుడు చిదానంద అధ్యక్షతన పార్టీ మండల ఎన్నికలధికారి నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మాజీ అధ్యక్షుడు కెఎస్ ప్రసాద్, నాయకులు మహేశ్, ఉలిగన్న పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

వెల్దుర్తి(కృష్ణగిరి): వృద్ధులు, అనాథలకు ప్రతి ఒక్కరు తమకు తోచిన సాయం చేయాలని హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు హరి నరసింహనాయుడు కోరారు. శుక్రవారం సంస్థ తరఫున సేకరించిన దుప్పట్లను పట్టణంలోని వృద్ధులకు పంపిణీ చేశారు.

సంతకం కావాలంటే పడిగాపులు కాయాల్సిందే


దేవనకొండలో ఆర్‌ఐ సంతకం కోసం పడిగాపులు కాస్తున్న ప్రజలు

దేవనకొండ: వివిధ పనులకు అవసరమైన పత్రాలు పొందేందుకు, పలు పత్రాలపై అధికారుల సంతకాలు చేయించుకోవాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ పత్రాలపై ఆర్‌ఐ సంతకం తప్పనిసరి కావడంతో ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. దాదాపు ఐదు సంవత్సరాల పాటు రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ఏ సర్టిఫికెట్లు కావాలన్నా గంటల్లో, ఒక రోజులో గ్రామ సచివాలయాల ద్వారా పని అయ్యేది. కానీ ఇప్పుడు ఏ సర్టిఫికెట్ కావాలన్నా ఆఫీసుల చుట్టూ వారాల పాటు తిరగాల్సిన దుస్థితి నెలకొంది. పేదోడి కల అయిన ఇంటి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద లబ్ధి పొందేందుకు లబ్ధిదారులకు కుల, ఆదాయ, పొజిషన్ సర్టిఫికెట్లు తప్పనిసరి. వీటి కోసం ప్రజలు పనులు మానుకుని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.